ఈ అనుభవం చాలు

వేపా శ్యామలాదేవి

"ఐస్ సోడా బాబూ! ఒక్కటి త్రాగితే చాలు మళ్ళీ మళ్ళీ త్రాగాలనిపిస్తుంది ఆలసించిన ఆశాభంగం రండి బాబూ రండి. ఆంధ్రా షోడా అయిపోతోంది" అంటూ చలాకీగా, నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ యించు మించు షోడాబండి అంతా అమ్మేసాడు పది సంవత్సరాల కుర్రాడు. మే నెల ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి వేడిగాలి చెంపలను తాకుతోంది బస్ కోసం అరగంట నుంచీ నిరీక్షిస్తున్న వందనా, ఆమె తండ్రి పరంధామయ్యగారూ ఒక్కసారి నీరసంగా విట్టూర్చారు ఈ వెధవ బస్సు అవసరమయినప్పుడు అసలు రాదు నీరసంగా స్తంభాన్నానుకుని నించున్న ముసలి తండ్రిని బాధగా చూసింది వందన

"అక్కా! ఈ సోడా త్రాగు నీ విసుగు ఒక్క క్షణంలో పోతుంది తాతగారూ! మీరుకూడా ఒకటి త్రాగాలి" అంటూ వందన వద్దని వారిస్తున్నా రెండు షోడాలు యిచ్చేడు ఎర్రటి ఎండలో, అంతకన్నా ఎక్కువగా మండుతున్న గుండెల్లోకి చల్లని పానీయం దిగటంతో కొంచెం రిలీఫ్‌గ ఫీలయ్యారు ఆ తండ్రీ, కూతురు

* * *

నెమ్మదిగా ఖాళీసోడాబండి తోసుకుంటూ పాట పాడుతూ వెళ్ళిపోయాడా కుర్రాడు ఆ కుర్రాడుతోనే చైతన్యమంతా ఒక్కసారి ఆగిపోయినట్లయింది "ఎంత నిశ్చింత జీవితం ఆడుతూ పాడుతూ గడిపే ఆ జీవితం ఎంత మధురమయినది ఎప్పుడూ, నవ్వుతూ తుళ్ళుతూ జీవితం అంటే నందనవనం అనుకునేరోజులు యివి భగవంతుడా! ఈ చిన్నిబాబుకి ఎలాంటి కష్టాన్ని కలిగించవద్దు"

'వందనా' అంటూ వీపుమీద జబ్బ వూడి పోయేలా తగిలిన దెబ్బకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది వందన

"ఓ శశీ! నువ్వా అబ్బా! ఎన్నాళ్ళకి కనిపించావే ఎక్కడ వుంటున్నావు? మీవారేం చేస్తున్నారు? సారీ శశీ! నీ మేరేజికి రాలేకపోయానే మా అమ్మగారికి అప్పుడు బాగా జబ్బు చేసింది" వందన మాటకు అడ్డుతగులుతూ "అబ్బ ఆగవే వందనా నీ యక్ష ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా జవాబు చెప్తాను కానీ, ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పు ఎక్కడ్నించి వస్తున్నావు? మొహం ఏమిటి అలా వాడిపోయింది ఈ ఊర్లో ఎవరు వున్నారు? మీవారికి ఈ ఊరు ట్రాన్స్‌ఫరయిందా? మీ ఆయన చాలా మంచివాడని, అందంగా ఉంటాడని ఆరేడు నెలల క్రితం నీ దగ్గరనుంచీ వచ్చిన లెటర్ తప్ప మళ్ళీ లెటర్ రాలేదు మీ ఆయన అందాన్ని చూసుకుంటూ నన్ను మరిచిపోయావు కదూ అరె, బాబాయిగారూ! మీరూ వచ్చారా? అదేమిటి బాబాయ్! మరీ అలా చిక్కి పోయారు అందమయిన అల్లుడ్ని చూడగానే మా

బాబాయికి భోజనం కూడా అవసరంలేదన్నమాట ''

గడగడ మాట్లాడేస్తున్న శశినే అందరూ కన్నార్పకుండా చూడ్డంతో ''వందనా! పదవే ఇక్కడే మా ఇల్లు చాలా కాలానికి కలుసుకున్నాం ఇవాళంతా కబుర్లు చెప్పుకుందాం'' అంటూ బలవంతంగా వాళ్లని తీసుకెళ్ళింది శశి

అందమయిన పెద్ద బంగాళా రకరకాల పువ్వులతో, అందంగా, గుబురుగా వున్న క్రోటన్ మొక్కలతో గార్డెన్ కళకళలాడుతోంది హాల్లో ఖరీదయిన సోఫాసెట్లు, మెత్తగా పరచిన కార్పెట్లు, గోడలకు తగిలించిన ఖరీదయిన ఒకటి, రెండు పెయింటింగ్స్ అడుగడుగునా శశి ఐశ్వర్యాన్ని చాటి చెప్తున్నాయి ఫ్రిజ్‌లోంచి చల్లని నీళ్లతో కూల్ డ్రింక్ కలిపి ఇచ్చింది ఆపిల్స్ కోసి ప్లేట్లల్లో సర్దింది ప్రతీ పనీ ఎంతో త్వరగా, నేర్పుగా చేస్తున్న శశిని ముచ్చటగా చూస్తోంది వందన ఎనిమిదిగంటలు అయినా ప్రక్కమీదనుంచిలేవకుండా, పిన్నితో లక్షోత్తరం చదివించుకుని మరీ లేచే శశేనా ఇది ఎంత చక్కగా చేస్తోంది పన్ను ప్రతీ పనిలో, ప్రతీ మాటలో ఎంత దర్పం ఆడదానికి ఇంతకన్నా యింకేం కావాలి శశి అదృష్టానికి వందన మనసు ఉప్పొంగిపోయింది

మూడవ వ్యక్తి వున్నారన్న ఆలోచన కూడా మరిచిపోయి స్నేహితురాళ్ళిద్దరూ కబుర్లలోపడ్డారు కాలేజీ సంగతులూ, స్కూలు సంగతులూ ఒకటేమిటి ఎన్నో విషయాలు వాళ్ళ సంభాషణలో చోటు చేసుకుని కాలాన్ని మరిపింపచేశాయి

పెళ్ళయింది మొదలు ఎప్పుడూ దిగులుగా, నిరాశగా వుండే వందన మళ్ళీ పూర్వపు మనిషిలా సంతోషంగా కనపడేసరికి ఆ ముసలి హృదయం ఎంతో ఆనందించింది

ఏమీ తోచక ప్రక్కనే టీపాయ్‌మీద వున్న పేపరు తీసుకున్న పరంధామయ్యగార్కి అక్కడ తను ఇంతవరకూ ఎప్పుడూ చూడని ఖరీదయిన వెడ్డింగ్ కార్డు అందమయిన గోల్డు కలర్ డిజైన్‌లో కనపడింది ఎవరిదో గొప్పవాళ్ళ శుభలేఖ అయి వుంటుంది ఒక్కసారి ఆ కార్డును చేతిలోకి తీసుకుని దాని అందాన్ని మరొకసారి తిలకించారు పరంధామయ్యగారు అప్రయత్నంగా ఆ కార్డుమీద వధూవరుల పేర్లు చూసిన ఆయన హృదయం బాధగా మూలిగింది చెట్టంత అడుగుపెట్టిన కోడల్ని, ఇంతటి శుభకార్యం దగ్గర్లో పెట్టుకుని బయటకు గెంటుతారా? భగవంతుడా! నాకీ వయసులో ఎందుకీ అంపపు కోత — అంటూ ఆయన హృదయం ఆక్రోశించింది

''బాబాయ్! ఏమిటలా చూస్తున్నారు? అవి మా అన్నయ్య పెండ్లి శుభలేఖలు సరిగ్గా ఇవాల్టికి వారం రోజులుంది పెళ్ళి ఈ వారం రోజులూ ఇక్కడే వుండిపోండి బాబాయ్ ఏకంగా పెళ్ళయ్యాకా వెళ్దురుగాని నా మాట కాదనకండి బాబాయ్ వందనా! మీ ఆయన్నుకూడా లెటర్ రాసి పిలిపించవే అందరం కలిసి సరదాగా వుండాం ఇంతకీ ఆ అమ్మాయిది మీ ఊరేనట మీ ఆయనకు తెలిసే వుంటుంది వందనా!'' అంది శశి గలగలా

భర్త టాపిక్ రాగానే తలవంచుకుని తన

ఈ అనుభవం చాలు

కన్నీళ్ళు శశికి కనబడకూడదని విశ్వప్రయత్నం చేస్తోంది వందన

''ఏవిటే! మీ ఆయన పేరు చెప్తేనే అలా మురిసిపోతున్నావ్ నా మాటలేమన్నా వింటున్నావా? లేదా?'' అంటూ వందన చుబుకం పైకెత్తింది

వందన కళ్ళు శ్రావణ మేఘాల్లా వర్షిస్తున్నాయి ఆశ్చర్యపోయిన శశి ''వందనా! ఎందుకలా బాధపడుతున్నావు? నాకు చెప్పవా? వచ్చినదగ్గర్నుంచి చూస్తున్నాను అంతవరకూ సరదాగా మాట్లాడే నువ్వు మీ అత్తారి ప్రసక్తి రాగానే ఉదాసీనంగా మారిపోవడం నేను కనిపెడ్తూనే వున్నాను నా దగ్గర కూడ నీకు దాపరికమేనా'' అంది బాధగా శశి

భుజాన వున్న ఉత్తరీయంతో చెమర్చిన కళ్ళను ఒత్తుకుంటూ —

''అదేం చెప్తుందమ్మా! శశీ, నేను చెప్తాను దాని కన్నీటి కథ వినమ్మా నువ్వూ, వందనా నాకు రెండు కళ్ళమ్మా నీకుగాక యింకెవరికి చెప్పుకోనమ్మా హృదయ వ్యధ

విజయవాడలో స్కూలు మాస్టరుగా చేసి రిటైరయిపోయిన భగవాన్‌దాసుగారి అబ్బాయితో మధ్యవర్తుల ద్వారా వందనకు సంబంధం కుదిరింది కుర్రాడు ప్రసాద్ చాలా బుద్ధిమంతుడూ,

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
* మన సినిమాలు
* ప్రేక్షకుల తీర్పు
శీర్షికలు
చూస్తున్నారా?

అందమయినవాడూ పిల్ల సుఖపడుతుంది అనుకున్నాను భగవాన్‌దాసుగారికి పిల్లలులేకపోవటాన ప్రసాద్‌ను దూరపు బంధువులనుండీ పెంపకానికి తీసుకొచ్చారు ప్రసాద్ వచ్చిన ఎనిమిది ఏళ్ళకు వాళ్ళకు అందాలబొమ్మ విజయ పుట్టింది అసలే ప్రసాద్‌ను అతిభయంతో పెంచిన ఆ దంపతులు, విజయ పుట్టగానే అతన్ని వాస్తవ చిన్నచూపు చూసేవారు కానీ, విజయకు మాత్రం అన్నయ్య ప్రాణం ప్రసాదు బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు అతని రేటు పదిహేను వేలు చెప్పారు పిల్లవాడ్ని వదులుకోలేక వాళ్ళు ఎంత కాదన్నా కాళ్ళావేళ్ళా పడి ఎనిమిది వేలకు ఒప్పించాను మీ పిన్ని పోయాకా దాని బంగారం, వందన బంగారం అంతా కలిపి పది కాసులు వందనకే పెట్టాను నాకున్న ఆ కాస్త పొలం అమ్మాను పదివేలు వచ్చింది ఉన్నంతలో దర్జాగా చెయ్యాలనే ప్రయత్నించేనమ్మా కానీ దురదృష్టం అన్నింటా ఎదురయింది ప్రధానం రోజు అయిదు వేలు యిచ్చాను మిగతా మూడు వేలూ పెళ్ళిపందిట్లో యిచ్చేలా నిర్ణయమయింది విడిదిలోకి వచ్చింది మొదలు అవి బాగులేవు, ఇవి బాగులేవు అంటూ ఏడ్పించటం మొదలుపెట్టారు పెండ్లివారు ఆడపిల్లని కన్నాకా తప్పుతుందా అనుకుని అన్నీ భరించాను చివరికి ముహూర్తం టైమ్‌కి ఇనప్పెట్టెలో భద్రంగా మూట కట్టి వుంచిన కట్నం మూడు వేలు మాయమయ్యాయి ఎంత వెతికినా కనపడలేదు ఏంచెయ్యాలో తోచలేదు అవతల వియ్యంకుడు డబ్బు యివ్వందే తాళి కట్టడానికి వీల్లేదని గోల చేస్తున్నాడు రెండు, మూడు నెలల్లో ఆ డబ్బు ఇర్చుతానని బ్రతిమాలాను వినలేదు చివరికి స్నేహితుల ప్రోత్సాహంతో ప్రసాదు మూడు ముళ్ళూ వేసాడు అప్పుడే వందనను కూడా తీసుకెళ్ళిపోయారు

అప్పుకోసం ఎక్కని గడపలేదు ''ఎందుకు మాస్టారూ! అందరి పరుగులు తాహతుకు తగ్గ సంబంధం చూసుకోకూడదూ! అయినా డబ్బు విషయంలో అంత అజాగ్రత్త ఏమిటి?'' అంటూ ఎదురు నాకే నీతులు బోధించారు చుట్టాలూ స్నేహితులూ

'మీరు పెట్టిన మూడు నెల్ల గడువు అయిపోయింది డబ్బు తీసుకురండి లేనిపక్షంలో మీ అమ్మాయిని శాశ్వతంగా మీదగ్గరే వుంచుకోండి ఉత్తర ప్రత్యుత్తరాలకి యింక అవకాశం లేదు ఈ విషయంలో అబ్బాయి నా మాట వింటాడు తప్పనిసరిగా'' అంటూ, ఒకరోజు పిడుగులాంటి లెటర్ వచ్చింది కాళ్ళరిగేలా తిరిగినా, ఎంత వడ్డీ అయినా యిస్తానన్నా ఎవరూ యివ్వలేదు యిక దాని ఖర్మానికి వదిలేసాను ఏ రో రెండు రోజులకు ప్రసాద్ క్యాంప్ వెళ్ళిన సమయం చూసుకుని వందన నగలన్నీ తీసుకుని వట్టి పిల్లను పంపేసేరు వాళ్ళ ఆడబడుచు విజయ పాపం ఎంత గోల చేసినా, వందన ఎంత బ్రతిమాలినా వినకుండా బయటకు గెంటేసారు దాన్ని వంటరిగా

ఆశ చావక అల్లుడ్నయినా బ్రతిమాలుకుందామని ఆత్మాభిమానం చంపుకుని బయల్దేరాం నేనూ, వందనా కానీ ''డబ్బు లేకుండా మళ్ళీ పిల్లని తీసుకువచ్చావా! సిగ్గులేదూ?'' అంటూ నోటికొచ్చిన మాటలన్నీ మాట్లాడి మా యిద్దర్నీబయటకు పంపేసారు మళ్ళీ నెలకి నీ కూతురికి విడాకులూ, నా కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేస్తాను అంటూ రంకెలు వేసాడు మా వియ్యంకుడు అడ్డువచ్చిన విజయనూ, ప్రసాద్‌నూ గదిలో త్రోసి గొళ్ళెం వేసారు నరరూపంలో వున్న రాక్షసులమ్మా వాళ్ళు ఆ రాక్షసులమధ్య వుంచలేక, దాని కాపరం నాశనమయిందన్న బాధతో తిరిగి యింటికి బయల్దేరాం ఇంతలో నువ్వు కనపడ్డావ్'' అంటూ కళ్ళు తుడుచుకున్నారు పరంధామయ్యగారు

''శశీ డార్లింగ్'' అంటూ కారు తాళాలు విలాసంగా వూపుకుంటూ వచ్చిన రవీంద్ర, అక్కడ అపరిచితుల్ని చూసి ఠక్కున ఆగిపోయాడు అతని వెనకే వస్తున్న విద్యాసాగర్ కూడా ఆగిపోయాడు

''ఏమిటలా చూస్తున్నారు ఈవిడ నా ప్రాణ స్నేహితురాలు వందన ఆయన ఆమె తండ్రి పరంధామయ్యగారు చిన్నప్పటినుండీ వందన నాకు మంచి స్నేహితురాలు'' అంది

''ఈయన మా శ్రీవారు రవీంద్ర, డాక్టర్ ఇతను మా అన్నయ్య విద్యాసాగర్, ఇంజనీర్

స్టేట్స్‌లో వుంటున్నాడు. మంచి మంచి సంస్కార భావాలు కలవాడు విజయని ఈ అన్నయ్యకే ఇస్తున్నారు'' అంటూ పరిచయం చేసింది

చిన్నప్పటినుండీ శశితో స్నేహమయినా, ఎప్పుడూ శశి ఇంటికి వెళ్ళేదికాదు వందన ఎక్కువగా శశే వందన ఇంటికి వచ్చేది అందువల్ల వీళ్ళు వందనకు అపరిచితులే అందరి దగ్గరా సెలవు తీసుకుని బయల్దేరారు వందనా,పరంధామయ్యగారూ

''బావగారూ ! విడిదిలోకి వచ్చిందగ్గర్నుంచీ మీరంతా చాలా ముభావంగా వున్నారు నావల్ల తెలియక ఏదయినా పొరపాటు జరిగితే క్షమించండి నాకున్నది విజయ ఒక్కర్తే కూతురు ముద్దూ ముచ్చట దానిక్కాక ఇంకెవరికి జరుపుతాను అల్లుడు అలకపాన్పు మీంచి దిగిరానంటున్నాడు స్కూటర్ కావాలంటున్నాడు ఇప్పుడు కొనివ్వలేను రెండు, మూడు నెలల్లో ఇస్తాను కనికరించండి బావగారూ'' అంటూ ప్రతిమాలుతూన్న భగవాన్ దాస్‌ని చూస్తే విజయ మనసు ప్రతీకారం చేసానన్న తృప్తితో నిండిపోయింది ఒక మంచి పనికి తనతో సహకరించిన అన్నా, అమ్మా, నాన్నలను మురిపెంగా చూసుకుంది శశి

పౌర్ణమి వెన్నెల డాబామీద పిండారబోసినట్టుగా వుంది చెక్కిట చెయ్యి చేర్చి అజంతా సుందరిలా వున్న విజయ దగ్గరకు వచ్చి కూర్చుంది శశి ''ఏమిటి వదినా ! అలావున్నావు ! ఇంటిమీదకు దృష్టి మళ్ళిందేమిటి ?'' అంది విజయా, శశి ఒకే ప్రాణంగా కలిసిపోయారు విజయను అందరూ అపురూపంగా చూస్తారు ఆ యింట్లో

''శశీ ! మీరంతా ఎంతో ప్రేమగా చూస్తున్నారు మీ ఇంటికి కోడలిగా రాగలిగిన నేను నిజంగా ఎంతో అదృష్టవంతురాల్ని కానీ మా అన్నయ్య గురించే నాకు బెంగ వాడు వట్టి అమాయకుడు నాన్నగారి ముందు పిల్లిలా వుంటాడు పాపం వందన వదినా, అన్నయ్య ఎంతో ప్రేమగా వుండేవారు పాపిష్టి కట్నం డబ్బులు కోసం వాళ్ళని నిర్దాక్షిణ్యంగా విడదీశారు నాన్నగారు ఈ వరకట్న పిశాచికి ఎన్నో జీవితాలు ఇలా బలయి పోతున్నాయి దేశం పురోగమిస్తోంది, నాగరికత పెరుగుతోంది, మానవుడు ప్రగతి పథానికి

ఈ అనుభవం చాలు

పయనిస్తున్నాడు అని అనుకోవడమే తప్ప ఎక్కడుంది ప్రగతి? ఏ విషయంలో పురోగమించాడు మానవుడు? తన కొడుక్కి పుట్టినప్పటినుంచీ ఖర్చుపెట్టిన డబ్బుకు కూడా వధువునుండే వసూలు వేయడమేనా ప్రగతి ? డిగ్రీలకి మార్కెట్లో రేట్లను నిర్ణయించడమేనా ప్రగతి ? నాగరికంగా అలంకరించుకున్నంత మాత్రాన, సంస్కారం కలిగిందా మనిషిలో ఎక్కడ వుంది సంస్కారం శశీ ! నన్ను పిచ్చిదానిగా అనుకోకు మా అన్నా, వదినలను కలిపి మా నాన్న లాంటి వాళ్ళ కళ్ళు తెరిపించేవరకూ నాకు మనశ్శాంతి లేదు ''

* * *

''ఏమేవ్ ! నిన్నే చూడు ఎవరొచ్చారో !'' అంటూ పేపరు చదువుకుంటున్న భగవాన్‌దాసుగారు సూట్‌కేసు చేత్తో పట్టుకుని గుమ్మంలోకి వచ్చిన విజయని చూసి ఒక కేక పెట్టారు

''నా తల్లే ఎన్నాళ్ళకమ్మా వచ్చావు విజయ తల్లీ నువ్వులేని ఇల్లు చిన్నబోయిందే అమ్మా'' అంటూ కళ్ళు తుడుచుకుంది కామేశ్వరమ్మ ''మీ ఆయనేరీ ? అతనికి సెలవు దొరకలేదా ?'' అంటు ఇంకా ప్రశ్నలు వెయ్యబోతున్న తల్లితో —

''అమ్మా ! మీరు స్కూటరు కొనిమ్మని ఎన్ని ఉత్తరాలు రాసినా 'ఇంకా డబ్బు జతపడలేదు, ఇంకోసారి ఇస్తాను' అంటూ రాసిన లెటర్స్ చూసి మా మామగారు స్కూటరు డబ్బూ, మా సంసారానికి కావలసిన ఫర్నీచరూ, పాత్ర సామానుకి అవసరమయిన డబ్బు తీసుకుని రమ్మన్నారు డబ్బు లేకపోతే రావద్దన్నారమ్మా'' అంటూ కళ్ళు తుడుచుకుంది

అప్పుడే ఆఫీసుకు బయల్దేరబోతున్న ప్రసాద్ చెల్లెల్ని ఆప్యాయంగా పలకరించాడు

''మీ మామగార్కి లెటర్ రాసాను గదా! త్వరలో ఇస్తానని నా ఆలస్యానికి పద్దీయా ఏమిటి మిగతా డబ్బు నీ పెళ్ళికే తాటాతూటం చేసి, అన్నయ్యచేత లోన్లు అన్నీ పెట్టించి తిప్పలు పడ్డాను ఏదో అనధికార్ను కట్నం లేకుండా నీ అందం చూసి చేసుకున్నారు, నీ అదృష్టం అనుకున్నాను లేకుంటే వాళ్ళతో మనం తూగగలమా సరే నువ్వు లోపలికెళ్ళి విశ్రాంతి తీసుకో'' అంటు చెప్పలేసుకుని బయల్దేరారు

'అబ్బాయ్ ! అల్లుడు ఉత్తరం రాసాడు అంటూ తల దువ్వుకుంటున్న ప్రసాద్‌ను పిలిచారు ''మీరు వారం రోజుల లోపుగా డబ్బు పంపకపోతే మీ అమ్మాయి శాశ్వతంగా మీ ఇంట్లో వుంటుంది'' అని రాసాడు విద్యాసాగర్ ''ఎంత ప్రయత్నించినా ఎక్కడా అప్పు పుట్టలేదురా ఆడపిల్లను ఎందుకు కన్నానా అని యిప్పుడు ఏడుస్తున్నాను పాపం, వందన తండ్రి కూడా యిలానే బాధపడివుంటాడు ఆయన వుసురు కొట్టింది నా చిట్టితల్లికి నిజమే! వరకట్న పిశాచం ఆడపిల్లల తండ్రుల్ని జలగలా పీల్చేస్తోంది పాపం ఆ అమ్మాయి ఎంత బాధపడుతోందో'' నెమ్మదిగ అనడం మొదలెట్టారు భగవాన్‌దాస్‌గారు

తండ్రిలోవస్తున్న మార్పుకి విజయ ఎంతగానో సంతోషించింది తండ్రికి వంతపాడి వందనను నరకయాతన పెట్టిన అమ్మ కూడా పదే పదే ''నట్టింటి మహాలక్ష్మిలా తిరుగుతూ,చెయ్యి అందరగా వుండే పిల్లను పాడు డబ్బు కోసం దూరం చేసుకున్నాము ఆ డబ్బు శాశ్వతమా, ఏమన్నానా ? ఛీ ! ఎంత పని చేసాం '' అనుకుంటూ విజయ దగ్గర బాధపడసాగింది

''అబ్బాయ్ ! యివాళ ఆఫీసుకి లీవు పెట్టి కోడల్ని, బావగార్ని వెంటపెట్టుకు తీసుకురా '' అన్నారు ఆఫీసకి బయల్దేరుతున్న ప్రసాద్‌తో తండ్రిలో వస్తున్న మార్పు గమనిస్తున్న ప్రసాద్ భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ బయల్దేరాడు

భుజాలనిండా పమిట కప్పుకుని, చిక్కిపోయినా ఎంతో అందంగా వున్న వందనా, తండ్రీ రిక్షాలోంచి దిగారు ఆశ్చర్యంగా చూస్తున్న ప్రసాదుకు నీరసంగా, శుష్కించిపోయిన వందనను చూడగానే ఆనందం, బాధా అన్నీ ఒకేసారి కలిగాయి చాచిన అతని చేతుల్లో వాలిపోయి, ఎవరు విడదీస్తారో తమని అన్నంత భయంగా అతన్ని కరుచుకుపోయింది ఆ దంపతులను చూసిన అందరి కళ్ళూ ఆనందంతో చెమర్చాయి ''బావగారూ ! అన్యాయం మీకోసం యింత కష్టపడి నాటకమాడిన మమ్మల్ని పలకరించనయినాలేకుండా మరీ అలా ఊహాలోకాల్లో తేలిపోవడం బాగులేదు '' అన్నాడు అప్పుడే వచ్చిన విద్యాసాగర్ తండ్రిలో వస్తున్న మార్పును చూసి, అటు వదినకూ, ఇటు భర్తకూ, శశికీ అందరికీ కృతజ్ఞతలర్పించింది విజయ

''నిజమే విజయా ! ఎండిపోతున్న మా బ్రతుకులను చిగురింపచేసారు చిన్నదానివయినా ఎంతో వివేకవంతురాలవు మీకు మేం చిరకాలం కృతజ్ఞులం'' అన్నాడు ప్రసాదు

''వట్టి కృతజ్ఞత కాదు, మా అబ్బాయికి మీ అమ్మాయినివ్వాలి'' అన్నాడు విద్యాసాగర్ ఆ యింట దివ్య దీపావళే జరిగింది ఆ రోజు

చిన్నదానివయినా నా కళ్ళు తెరిపించావమ్మా విజయా ! ''నాకీ అనుభవం చాలు'' అన్నారు దాసుగారు